

### మా కుమారుడికి ఏఆర్ ఎస్ఐ ఉద్యోగం వచ్చింది..

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాలను భారీగా భర్తీ చేస్తున్నది. రెండేండ్ల క్రితం మా కుమారుడు రమేశ్ కష్టపడి చదివి ఏఆర్ ఎస్ఐ కొలువును సాధించాడు. మాకున్న కొద్దిపాటి పొలంలో వరిని పండిస్తూ మరోవైపు కాటన్‌మిల్లులో కూలీలు పనిచేస్తూ ముగ్గురు పిల్లలను ఉన్నతంగా చదివించాం. మా పిల్లలు మా కష్టాన్ని వృథా చేయలేదు. కష్టపడి చదివి పెద్దకొడుకు ఏఆర్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మా తండాలో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన మొట్టమొదటి వ్యక్తి మా కుమారుడు కావడం చాలా సంతోషంగా ఉన్నది. అందరూ అతడ్ని అభినందిస్తున్నారు.

**-ఇస్లావత్ గోప్యానాయక్, కోమటి దంపతులు**
**హర్యానాయక్ తండా, తలకొండపల్లి**

### ఇద్దరు కొడుకులకు సర్కారు కొలువులొచ్చాయి..



ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన కానిస్టేబుల్ ఫలితాల్లో నా ఇద్దరు కొడుకులకు ప్రభుత్వ కొలువులు వచ్చాయి. పెద్ద కుమారుడు ప్రేమ్‌కుమార్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా.. రెండో కుమారుడు నిస్సిత్ కుమార్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఇద్దరు కుమారులు ఒకేసారి ఉద్యోగాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉన్నది. సీఎం కేసీఆర్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా సాగుతున్నది. రూపాయి ఖర్చులేకుండా.. ఎలాంటి అవినీతి లేకుండా అర్హులకు సర్కారు కొలువులు వస్తున్నాయి. గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనతో పోల్చితే కేసీఆర్ పాలనలోనే అత్యధికంగా ఉద్యోగాలొచ్చాయి. 2023 కానిస్టేబుల్ ఫలితాల్లో మా గ్రామంలో 11 మంది ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడం ఎంతో అభినందనీయం. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఎంతో మంది నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయి.

**-భూపతి దాసు, నందివనపర్తి, యాచారం**

### పైరవీలకు తావులేదు



2014 తర్వాత తెలంగాణ ప్రభుత్వం భారీగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నా యి. పైరవీలు లేకుండా నయాపైసా అవినీతికి తావు లేకుండా నియమాకాలు జరుగుతున్నాయి. నా కుమారుడికి కూడా ఎలాంటి పైరవీలు లేకుండానే ప్రభుత్వ కొలువు రావడంతో కుటుంబానికి భరోసా కలిగింది. గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో ఏండ్లు గడిచిన కూడా ఉద్యోగాలను భర్తీ చేయలేదు.

**-లక్ష్మి, అలూర్ గ్రామం, చేవెళ్ల మండలం**



## స్వరాష్ట్రంలో..

# కొలువుల జాతర

- ప్రిపరేషన్‌కూ ప్రభుత్వం చేయూత
- ప్రతిభతో రంగారెడ్డి జిల్లాలో వేలాది మందికి దక్కిన ప్రభుత్వ ఉద్యోగాలు
- గత ఉమ్మడి ప్రభుత్వాల హయాంలో ఊసేలేని ఉద్యోగాల భర్తీ
- యువత కష్టానికి దక్కిన ప్రతిఫలం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఉద్యోగుల తల్లిదండ్రులు

రంగారెడ్డి, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ): ఒకప్పుడు సర్కారు కొలువులంటే డబ్బున్నోళ్లకే భాగ్యం. పేద యువతలో టాలెంట్ ఉన్నా.. డబ్బులు చేతిలో పట్టుకుని పైరవీలు చేస్తే గానీ ప్రభుత్వ ఉద్యోగం వచ్చేది కాదు. గత ఉమ్మడి ప్రభుత్వాల హయాంలో ఉద్యోగాల భర్తీ లేక యువతీయువకులు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ జీవితం వెళ్లదీశారు. సర్కారు కొలువుల కోసం యువత కన్న కలలను సీఎం కేసీఆర్ స్వరాష్ట్రంలో నిజం చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక టీఎస్‌పీఎస్సీ ద్వారా కొలువుల జాతర మొదలైంది. నోటిఫికేషన్లను సద్వినియోగం చేసుకున్న జిల్లాకు చెందిన ఎందరో యువతీయువకులు కేవలం ప్రతిభతోనే ఉద్యోగాలను దక్కించుకున్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా రిక్రూట్‌మెంట్ నిర్వహించడంతోనే తమ పిల్లలకు ఉద్యోగాలు దక్కాయని ఉద్యోగాలు పొందిన కుటుంబాలు పేర్కొంటున్నాయి. తమ పిల్లల కష్టానికి తగిన ఫలితం దక్కిందని ఉద్యోగుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సాకారమైన నియామకాల నినాదం..

నీళ్లు, నిధులు, నియామకాల నినాదం తెలంగాణ రాష్ట్రంలో సాకారమవుతున్నది. రాష్ట్ర కల సాకారమైన నాటి నుంచే ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తూ వస్తున్నది. గ్రూప్-1, గ్రూపు-2 మొదలుకుని పోలీసు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణాధికారులు..ఇలా వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీని రాష్ట్ర సర్కారు చేపట్టింది. గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల కొలువులపై యువత ఆశలు వదులుకోగా..స్వరాష్ట్రంలో వరుస నోటిఫికేషన్లతో మళ్లీ వారి ఆశలు చిగురించాయి. ప్రతిభకు పట్టం కడుతూ..పారదర్శకంగా.. పైరవీలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తున్నది. వేలాది మంది నిరుద్యోగులు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. ప్రభుత్వంపై పూర్తి భరోసాతో చదివి కొలువులను దక్కించుకోగలిగామని ఉద్యోగాలు పొందిన వారు గుర్తు చేస్తున్నారు. తమ పిల్లలకు ప్రభుత్వ కొలువులు వస్తాయని కలలో కూడా అనుకోలేదని, తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశయాలను స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సాకారం చేశారని ఉద్యోగుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

### స్థానికులకు పెద్దపీట..

అశాస్త్రీయమైన జోనల్ వ్యవస్థతో ఉమ్మడి రాష్ట్రంలో జిల్లావాసులు తీవ్రంగా నష్టపోయారు. ఆంధ్రా ప్రాంత యువతకే ఉద్యోగాలు లభించేలా పాత జోనల్ వ్యవస్థ ఉండేది. తద్వారా తెలంగాణ యువతకు తీవ్ర అన్యాయం జరిగింది. సీఎం కేసీఆర్ జోనల్ వ్యవస్థలో మా ర్పులు, చేర్పులు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అమలులో ఉన్నటువంటి జోన్ 5, జోన్ 6 స్థానంలో 2 మల్టీ జోన్లు, 7 కొత్త జోన్లను ఏర్పాటు చేసి జిల్లాల వారీగా ఉద్యోగాల నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా స్థానికులకు 95 శాతం మేర ఉద్యోగాలు పొందేందుకు వీలు ఏర్పడింది. పోలీస్ శాఖ వంటి యూనిఫాం సర్వీసులు మినహాయించి ఇతర ప్రత్యక్ష నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని పదేండ్లకు ప్రభుత్వం పెంచింది. ఓసీలకు 44 ఏండ్లకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 49 ఏండ్లకు, దివ్యాంగులకు 54 ఏండ్లకు గరిష్ఠ వయో పరిమితిని ప్రభుత్వం పెంచింది.

### ప్రిపరేషన్‌కు చేయూత..

పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంత యువత కూడా ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేందుకు తెలంగాణ ప్రభుత్వం చేయూతనిచ్చింది. స్టడీ సెంటర్లలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని లైబ్రరీలను ఆధునీకరించి పోటీపరీక్షలకు అవసరమై న అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచింది. నిరుద్యోగుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ ప్రభుత్వం పనితీరును ప్రతి ఒక్కరూ పొగుడుతున్నారు.



### మా కుటుంబంలోకి వెలుగులు రానున్నాయి..

మాది కడ్తాల్ మండలంలోని గాన్గుమార్లతండాలోని మధ్యతరగతికి చెందిన గిరిజన కుటుంబం. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కోరిక చాలా ఉండేది. కానీ అప్పటి పరిస్థితిల్లో నేను ఇంటర్ వరకే చదివాను. వారసత్వంగా వచ్చిన పొలంలో పనులు చేసుకుంటూ జీవిస్తున్నా. నాకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నది. పిల్లలను గ్రాడ్యుయేట్ వరకు కష్టపడి చదివించా. పెద్ద కుమారుడు మునేశ్ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఐ ఫలితాల్లో 193.4 మార్కులతో ఏఆర్ ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించాడు. నేను కన్న కలల్ని కొడుకు నెరవేరుస్తుండటంతో ఎంతో ఆనందంగా ఉన్నది. మా తండాలో ఎస్ఐగా ఉద్యోగాన్ని పొందిన వ్యక్తి మొదటి వ్యక్తి మునేశ్ కావడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు కావడంతోనే నా కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం వచ్చింది. సీఎం కేసీఆర్ స్వరాష్ట్ర ఫలాలను అందరికీ అందించేలా పాలన సాగిస్తున్నారు. ఆయనతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.

**-సభావట్ నర్సింగ్, గాన్గుమార్లతండా, కడ్తాల్**

### నాడు ప్రైవేట్ టీచర్.. నేడు పోలీస్ ఉద్యోగం



వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబంలో జన్మించా. ఎన్నో కష్టాలు పడి ఉన్నత విద్యాభ్యాసం చేసి ప్రభుత్వ ఉద్యోగాన్ని చదించా. గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ సరిగ్గా జరుగలేదు. దీంతో నేను ఓ ప్రైవేట్ బడిలో టీచర్‌గా పనిచేశా. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత సర్కారీ కొలువులు భర్తీ అవుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన పోలీసు నోటిఫికేషన్‌లో నాకు 121 మార్కులు రావడంతో సివిల్ పోలీస్ ఉద్యోగం వచ్చింది. చాలా సంతోషంగా ఉన్నది.

**-ఉడుతల సత్యనారాయణ, గ్రామం నాగిల్ల, మాడ్గుల మండలం**

### అవినీతికి చోటేలేదు..



సీఎం కేసీఆర్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పారదర్శంగా సాగుతున్నది. ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేకుండా నయాపైనా లంచం ఇవ్వకుండా అర్హులకే ప్రభుత్వ కొలువులు దక్కుతున్నాయి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి నిరుద్యోగ యువతీయువకులకు ఎన్నో ఉద్యోగాలను కల్పించి వారి భవిష్యత్‌ను బంగారంగా మార్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది.

**- రవీందర్‌గౌడ్, మిర్జాగూడ, శంకర్‌పల్లి**




అనుచరులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అసమ్మతి నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి

## మల్‌రెడ్డి రంగారెడ్డికి టికెట్ కేటాయించినా..

# బీఫామ్ నాకే వస్తుంది

- నాలుగుసార్లు ఓడిపోయిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం టికెటిచ్చింది..
- నిత్యం ప్రజల్లో ఉండే నాకు అన్యాయం చేసింది
- కాంగ్రెస్ అసమ్మతి నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి
- ఇబ్రహీంపట్నంలో అనుచరులతో సమావేశం..
- మూడు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ తెలుపుతానని వెల్లడి

ఇబ్రహీంపట్నం రూరల్, అక్టోబర్ 31 : నిత్యం ప్రజల్లో ఉండే తనను కాదని.. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయిన మల్‌రెడ్డి రంగారెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించటం ఎంతో బాధగా ఉందని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ అసమ్మతి నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో ఆయన తన అనుచరులతో సమావేశం నిర్వహించారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ.. వారి సేవకే జీవితాన్ని అంకితం చేసిన తనకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల సమయంలోనే వచ్చి పోయే.. అస్సలు ప్రజల సమస్యలను పట్టించుకోని మల్‌రెడ్డి రంగారెడ్డికి ఎలా టికెట్ కేటాయిస్తారని ప్రశ్నించారు. ఆదిబట్ల సర్పంచ్‌గా ప్రారంభమైన నా జీవితం, ఎంపీటీసీగా, ఎంపీపీగా, కౌన్సిలర్‌గా కొనసాగినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకున్నా ఎప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తానన్నారు. నా భార్య జడ్పీటీసీగా గెలుపొంది నిత్యం ప్రజల్లోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదన్నారు.

### బీఫామ్ వస్తుందన్న నమ్మకముంది..

ఏనాడూ ప్రజల బాగోగులు చూడని మల్‌రెడ్డి రంగారెడ్డికి టికెట్ వచ్చినా.. ప్రతిక్షణం ప్రజల కోసం పనిచేసే తనకే బీఫామ్ వస్తుందనే నమ్మకముందని నిరంజన్‌రెడ్డి అన్నారు. కుటుంబీకులు, అనుచరులు, పార్టీ నాయకులు, ఎంఎన్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులతో ఆలోచించి రెండు,మూడు రోజుల్లో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని ఆయన తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కుతంత్రాలు పన్నినా నా జీవితం ప్రజాసేవకే అంకితమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మోతీరాంనాయక్, ఏదుళ్ల జంగారెడ్డి, దెంది రాంరెడ్డి, గజ్జి రామకృష్ణ, లక్ష్మణ్, వాజిద్, టేకుల కమలాకర్‌రెడ్డి, ఉదయ్‌పాల్‌రెడ్డి, కృష్ణ, మూర్తి, మహేశ్‌గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంఎన్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల చైతన్యంతోనే

# తెలంగాణ అభివృద్ధి

**రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి**



మద్దూర్ మండలంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎండ్ల బండిపై మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 31: ప్రజల చైతన్యంతోనే తెలంగాణ అభివృద్ధి ఆధారపడి ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గం మద్దూర్ మండలంలోని పెదిరిపాడు, చెన్నారెడ్డిపల్లి, మోమినాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం రాత్రి వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్ముకుంటే వ్యవసాయానికి 3 గంటల కరెంటు మాత్రమే మిగులుతుందని, కేసీఆర్‌తో 24 గంటల నాణ్యమైన కరెంటు సరఫరాతో పండుగలా వ్యవసాయం చేసుకునే ఆస్కారం ఉంటుందన్నారు.

పంట పెట్టుబడితో పాటు కుటుంబానికి భరోసాగా రైతుబీమా వంటి సదుపాయాలను కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌కు తగ్గట్టుగా పిట్టకథలు చెప్పే రేవంత్ తోడైయ్యాడని, కాంగ్రెస్ 6 గ్యారెంటీలు చెల్లుబాటు అయ్యే ప్రసక్తి లేదన్నారు. కర్ణాటకలో కూడా గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలను కాంగ్రెస్ నమ్మబలికిందని, నేడు కన్నడ ప్రజలు కాంగ్రెస్ పై దుమ్మెత్తి పోస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమానికి పాటుపడుతుంటే.. కాంగ్రెస్ ప్రజాసంక్షమ పథకాలను అమలు కాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందించిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందని, సీఎం కేసీఆర్ కొడంగల్ నియోజవకర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు మంజూరుతో ప్రతి గ్రామానికి రోడ్డు, తాగునీరు వంటి ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో వచ్చే కాంగ్రెస్ నాయకులకు ప్రజలో బుద్ధి చెప్పాలని కోరారు. ఓటమి భయంతో నియోకవర్గంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులను కొనుగోళ్లు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని, డబ్బుకు అమ్ముడుపోయే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌కు మరో మారు అవకాశాన్ని కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి ప్రజాసేవకు అంకితమౌతానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని ఆకాంక్షించి గ్రామ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీలో చేరుతుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు మోసపూరితమైన మాయాజాలంలో పడవద్దని, ఎన్నికల సమయంలోనే సమన్వయంతో కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



మంత్రి ప్రచారానికి భారీగా తరలివచ్చిన ప్రజలు